సూర్యునిలోని మచ్చలు ప్రతి పదకొండున్నరేళ్ళకూ ఒకసారి మారుతూ వుంటాయి.

ఈ కాలంలో జరిగే మార్పులు మనిషి శరీరంలోని మరో శరీరమైన సూక్ష్మ శరీరం గ్రహించి స్థూల శరీరానికి అందజేస్తుంది. తద్వారా స్థూల శరీరం ఆరోగ్యాన్ని పొందుతోంది.

కాలచక్రం తిరిగి ప్రకృతిలో జరిగే మార్పుకు సూర్యుడు, గ్రహాలు, అయస్కాంత కిరణాలు, ప్రోటాన్ రేణువుల్ని ప్రసారం చేస్తాయి.

వీటిని ప్రకృతిలో వుండి ముందుగా స్వీకరించేది సూక్ష్మశరీరమేనని భిజేవిస్కి తన పరిశోధనలద్వారా బట్టబయలు చేశాడు.

అంతేకాదు 'నెగటివ్ కణాలు' కలిగిన కరెంటు శక్తితో స్థూల శరీరంపై ఏర్పడిన వ్రణాలుపై చికిత్స చేసినపుడు ఆ వ్రణం వెనకనున్న సూక్ష్మ శరీరం ఉత్తేజం కాబడి ఆ వ్రణం త్వరగా మానుతుంది. ఇక సూక్ష్మ శరీరమే లేని మనిషికి ఎన్ని చికిత్సలు చేసి ఫలితమేముంది?" అన్నాడు తిరుపతి.

"అయితే ఇప్పుడు మేమేం చెయ్యాలి?" ఆందోళన నిండిన స్వరంతో అడిగాడు అభిరాం.

"చాలా కష్టసాధ్య మైన పనది" అన్నాడు తిరుపతి.

"ఎంత కష్టమైనా పడతాను. నా మిత్రుడ్ని కాపాడుకుంటాను" ఆవేశంగా అన్నాడు అభిరాం.

"అయితే మీ మిత్రుడి సూక్ష్మశరీరం ఎక్కడ వున్నదో త్వరగా కనుక్కొని దాన్ని తిరిగి అతనిలోకి ప్రవేశపెట్టండి చాలు" అన్నాడు తిరుపతి.

ఆ మాటతో తల గిర్రున తిరిగిన అనుభూతి-- అశ్రునయనాలతో నిస్సహాయంగా తిరుపతి వంక చూశాడు అభిరాం.

"వేరే మార్గం లేదా?"

"లేదు! ముందు అతని సూక్ష్మశరీరం ఎక్కడ బంధింపబడివుందో తెలుసుకుని, అలా బంధించిన క్షుద్రోపాసకుడిని తన ప్రయత్నంలో సఫలీకృతుడిని కాకుండా చూసి, వాడి తాంత్రిక శక్తుల్ని మించిన శక్తితో ఎదుర్కొంటే కానీ ఈ సమస్యకి సమాధానం చెప్పలేం. అదీ పంథొమ్మిది రోజుల వ్యవధిలో" బాంబ్ పేలుస్తున్నట్టు అన్నాడతను.

"ఏం చెయ్యాలిప్పుడు? ఎలా సాధించాలీ మహాయజ్ఞాన్ని ..... అది పరిమితమైన పంథొమ్మిది రోజుల్లో తీవ్రమైన ఆలోచనలతో అతడి మెదడు వేడెక్కి మొద్దుబారిపోయింది.

"స్స ..... స్స ..... స్స ..... స్స ..... " పాము బుస కొడుతున్నట్టు ఉండుండి, విన్పించిన ధ్వనికి ముగ్గురూ మహదేవ్ వైపు తిరిగారు.

'గుర్ ..... ర్ ..... ర్ ..... స్స ..... స్స' ఈసారి మరింత పెద్దగా విన్పించింది.

"ఎందుకలా అవుతుంది?" అడిగాడు అభిరాం.

"మానవ శరీరం సప్తధాతువుల సమాహారం. అవి ప్రాణం, చర్మం, రక్తం, కొవ్వు,

ఎముకలు, వాటిలోని గుజ్జు, మాంసాలు.

ఈ సప్త ధాతువుల్ని బృహత్‌జ్యోతి అంటారు. సాధన ద్వారా ఈ బృహత్ జ్యోతిని తమ చెప్పుచేతల్లోకి తెచ్చుకోవచ్చు సాధకులు.

సప్తధాతువులకి వేరువేరుగా అధిష్టాన దేవతలు వున్నారు. ఈ దేవతలు యం, రం, లం, వం, శం, సం, హం అనే బీజాక్షరాలకి పలుకుతారు. వాటిని ఉచ్ఛరిస్తూ సాధకులు మనిషి సప్తధాతువుల్లో తనకి కావలసిన ధాతువు అధిష్టానదేవతని ఉద్రిక్తపరిచి బాధపెట్టగలడు.

ఇప్పుడు మీ స్నేహితుడు 'సర్వయికల్ రిబ్' అంటే ఉర:పంజరంలో మొదటి పక్కటెముకమీద మరో చిన్న పక్కటెముక పెరుగుతుంది.

ఇది మెడ ఏడవ వెన్నుపూస నుంచి మొదలైన రిబ్‌మీద జరుగుతుంది కాబట్టి దీన్నలా అంటారు.

ఇది ముందునుంచీ వుండి క్రమక్రమంగా పెరిగితే తీవ్రమైన మెడ నొప్పి ఏర్పడుతుంది. మీ స్నేహితుడి విషయంలో ప్రస్థుతం జరుగుతుందదే" అన్నాడు తిరుపతి.

ఇంతలో మహదేవ్‌ని ట్రీట్ చేస్తున్న డాక్టర్ వచ్చాడు.

మహదేవ్ పరిస్థితిని చూసి అతనికేం చేయాలో తోచలేదు.

'తెలివిలో లేని రోగి శారీరకంగా బాధపడటం తెలుస్తోంది. కానీ అదే ప్రదేశంలో కలుగుతున్న బాధ?' తీవ్రంగా ఆలోచించాడతను.

క్షణక్షణానికీ మహదేవ్ బాధతో మెలికలు తిరిగిపోతున్నాడు. వెంటనే అతన్ని స్కానింగ్ రూంలోకి తీసుకుపోయాడు డాక్టర్.

ముందుగా అతనికో ఇంజెక్షన్ చేశాడు. తరువాత వరుసగా వున్న కంప్యూటర్ మానిటర్స్‌ని ఏక్టివేట్ చేశాడు. శరీరంలోని ఒక్కో ప్రదేశాన్ని స్కానింగ్ తీస్తూ ప్రత్యేకంగా చూపిస్తున్నాయవి.

హార్ట్, లంగ్స్, కార్డియాక్, కిడ్నీస్, లివర్ ..... ఏ అవయవంలోనూ ఎటువంటి లోపం కనిపించలేదతనికి. వరప్రసాదం, అభిరాంలతోపాటు తిరుపతి కూడా చూస్తున్నాడు మౌనంగా.

అన్నీ చూసిన డాక్టర్ వేగంగా అక్కడ్నుంచి కదిలి బయటకు వెళ్ళిపోయాడు.

"ఏమయిందతనికి?" అన్నాడు అభిరాం.

"ఎక్కడ లోపం వుందో డయాగ్నైజ్ చేయలేకపోయాడు. బహుశా మరో డాక్టర్ని ఎవర్నయినా తీసుకొస్తాడేమో" అన్నాడు తిరుపతి.

"స్స ..... స్స ..... గుర్ర్ ..... స్స ..... " మహదేవ్ నోటినుంచి తాచుపాము బుసతో పాటు అతను పడుతున్న శారీరక హింస అక్కడున్న ముగ్గురికీ అతని మొహంలో చాలా స్పష్టంగా కనిపించింది.

ఇంతలో డాక్టర్ తనతోపాటు చీఫ్‌ని కూడా వెంటబెట్టుకుని వచ్చాడు.

అతను కూడా వరుసగా మహదేవ్ శరీరంలోని అవయవాలని గమనిస్తున్నాడు

స్కానింగ్‌లో.

అతనికేం తోచిందో ..... “పేషెంట్ బాడీని ఒక్కవారగా వుంచి స్కానింగ్ తీశారా?” అనడిగాడు డాక్టర్ని.

“యూ మీన్ ..... ” అర్థంకానట్టు అడిగాడు డాక్టర్.

“ఐ మీన్ హీ ఈజ్ సఫరింగ్ ఫ్రమ్ సర్వాయికల్ రిబ్ ..... ప్లీజ్ స్కాన్ ఇట్” అన్నాడు సీరియస్‌గా.

మరుక్షణం డాక్టర్ మహదేవ్‌ని పక్కకి జరిపి అతని పక్కటెముకలపైకి స్కానింగ్ ఎనలైజర్ని పోనిచ్చాడు.

అప్పుడు కన్పించింది అతనికి మహదేవ్ పక్కటెముకపై మరో పక్కటెముక పెరిగి వున్న సంగతి.

“యువార్ రైట్ చీఫ్” తను గుర్తించలేని విషయాన్ని అతను గుర్తించినందుకు అభినందనలు తెలుపుతూ అన్నాడు డాక్టర్.

“ఇట్స్ ఆల్‌రైట్” హుందాగా అని బయటికి నడిచాడతను.

అభిరాం, వరప్రసాదం ఇద్దరూ నిర్ఘాంతపోయారు “.....అక్షరాలా తిరుపతి చెప్పినట్లే జరిగింది. ఈ విషయం ఎలా తెలిసింది అతనికి. అతని కళ్ళే స్కానింగ్ మిషన్లకంటే గొప్పవా?” అనుకున్నారు.

వాళ్ళ ఆలోచనలని చెదరగొడుతూ అన్నాడు డాక్టర్ ..... “మిస్టర్ అభిరాం! మీ ఫ్రెండ్ పక్కటెముక మీద మరో ఎముక పెరుగుతోంది. దీనివల్లనే అతను బాధపడుతున్నాడు. ఇది మందులవల్ల నయమవదు. ఆపరేట్ చేసి ఎగస్ట్రా రిబ్‌ని తొలగించడమే దీనికి పరిష్కారం. కానీ ఖర్చెక్కువ” అన్నాడు.

“నా స్నేహితుడికే బాధ లేకుంటే అంతే చాలు. డబ్బుకాదు నాకు ముఖ్యం” అన్నాడు అభిరాం.

“అయితే ఆపరేషన్‌కి సిద్ధం చేయిస్తాను.”

“సరే” అన్నాడు అభిరాం.

డాక్టర్ హడావుడిగా అక్కడి నుంచి బయటికి నడిచాడు. అభిరాం, వరప్రసాదం, తిరుపతి ఎవరి ఆలోచనలలో వాళ్ళున్నారు.

‘జరుగుతున్నది, జరగబోయేవి చెప్పేస్తున్న తిరుపతి శక్తి అంచనాలకి అందకుండా వుంది. మొట్టమొదట అతను మహదేవ్‌ని చూసి అతని శరీరంలో సూక్ష్మ శరీరం లేదని చెప్పాడు.

అతను చెప్పింది నిజమేనన్న సంగతి కిర్లియన్ కెమెరాలోంచి చూస్తే నిర్ధారణ అయింది.

తర్వాత మహదేవ్ పడే బాధకి కారణం చెప్పాడు. స్కానింగ్‌లో అదీ అతను చెప్పినట్లే

జరిగింది.

ఇన్ని తెలిసిన మనిషికి మహదేవ్‌ని కాపాడే శక్తి లేదా? లేకపోతే తనకెందుకులే అని మిన్నకుండిపోతున్నాడా?' అనుకున్నాడు అభిరాం.

అతని ఆలోచనలకి భిన్నంగా ఆలోచిస్తున్నాడు వరప్రసాదం. తిరుపతి యోగం ద్వారా కుండలినీ శక్తిని సాధించాలనుకుంటున్న వ్యక్తి.

కొంతవరకూ అతను తన సాధనలో విజయం సాధించాడు కూడా. ఆ విషయాలు తమకి ప్రస్ఫుటమయ్యాయ్. హిమాలయాల్లో తపస్సుచేత ఋషిత్వం సంపాదించుకున్న మహాత్ముల ముఖాల్లో కనిపించే తేజస్సు అతనితోనూ కనిపిస్తుంది.

మహదేవ్‌ని కాపాడగల వాళ్ళెవరో తిరుపతికి తప్పకుండా తెలుస్తుంది. ఇన్ని విషయాలు తెలుసుకుని చెప్పగలుగుతున్న అతనికిది అసాధ్యమనిపించడం లేదు. ఎలాగైనా అతని ద్వారా మహదేవ్ మరణాన్ని ఆపగల శక్తిని తెలుసుకోవాలి.'

అభిరాం, వరప్రసాదం ఆలోచనలు ఆ విధంగా సాగుతుంటే తిరుపతి ఆలోచనలు మరొక విధంగా సాగుతున్నాయి.

"యోగం, ధ్యానం చేసి ఋషులు ఎంతటి శక్తి సంపదలు పొందుతారో, క్షుద్రోపాసకులవల్ల క్షుద్రోపాసకులూ అంతటి శక్తి సంపదలనే పొందుతారు. దాని కోసం ఏళ్ళూ పూళ్ళూ కఠోర సాధనలు చేస్తారు. ఆ సాధనలు చేయగా ఋషులు దైవత్వం పొందితే, క్షుద్రోపాసకులు క్రూరత్వానికి ప్రతిరూపాలైపోతారు. అప్పుడు మనుషుల ప్రాణం నల్లిని చంపినంత సులువు వారికి.

అందుకే ఒక్కసారిగా తమ శత్రువుల్ని చంపకుండా రోజుకో అంగం బాధపెడుతూ చిత్రహింసలు అనుభవించేలా చేస్తారు. ఇంకా మహదేవ్ పందొమ్మిది రోజులు తన శరీరంలో వివిధ అంగాలు కృశించిపోయి కోల్పోతూ మరణాన్ని పొందుతాడు. ఈలోగా ఏదయినా అద్భుతం జరిగితే తప్ప అతను బతికి బట్టకట్టలేడు. ఆ అద్భుతాన్ని చేసే మహామాన్వితుడు ఎక్కడున్నాడో?

"అభిరాంగారూ ..... దీనిమీద సంతకం చేయండి ..... " నర్సు మాటలకి ముగ్గురూ ఆలోచనా అలలు చెదిరిపోయి ఇహ లోకంలోకి వచ్చారు.

అభిరాం నర్సు అందించిన పాడ్ అందుకుని ఏదో మాటర్ రాసున్న కాగితాన్ని చదివాడు.

ఆపరేషన్ సమయంలో పేషెంట్ ప్రాణానికి ఎటువంటి ప్రమాదం ఏర్పడినా దానికి ఎవరూ బాధ్యులు కారనీ, డాక్టర్లు నిర్వహిస్తున్న ఫలానా ఆపరేషన్‌కి తమ సమ్మతిని తెలియజేస్తున్నామని రోగికి కావలసినవారి నుంచి హాస్పిటల్ ఆనవాయితీగా తీసుకునే ఆథరైజేషన్ లెటర్ అది.

మౌనంగా దానిమీద సంతకం చేసి నర్సుకందించాడు అభిరాం.

వరప్రసాదం ఈ తతంగమంతా భావరహితంగా చూస్తున్నాడు.

తిరుపతి దీక్షలో వున్న ఋషిపుంగవుడిలా కళ్ళుమూసుకుని మళ్ళీ దీర్ఘాలోచనల్లో మునిగిపోయాడు.

అభిరాం నిర్వికారంగా కూర్చున్నాడు. స్ట్రెచర్‌మీద రోగుల్ని తీసుకువెళుతున్న హాస్పిటల్ బాయ్‌లు, హడావుడిగా అటూ ఇటూ పరుగులు తీస్తున్న నర్సులు, తమ వారికి జబ్బు నయమైందని సంతోషంగా వున్నరోగుల బంధువులు, జనన మరణాలు అతి సహజం అన్నట్టు ఏ భావ ప్రదర్శనా లేకుండా విధి నిర్వహణ చేసే డాక్టర్లు .....

అతనికెందుకో మనస్విని గుర్తుకొచ్చింది.

“ఏం చేస్తుండి వుంటుందామె ఈ సమయంలో? తన ప్రియతముడు కోలుకుంటున్నాడని ఆనందిస్తుంటుందా? లేక అతని సన్నిధిలో గడిపిన మధురస్మృతుల ప్రతిబింబాలతో ముచ్చట్లాడుతూ కాలాన్ని కాంతివేగంతో దొర్లిస్తుంటుందా?

అసలామె మహదేవ్‌ని ఈ క్షణం చూస్తే తట్టుకుంటుందా? లేదు ..... తట్టుకోలేదు.

ఆమెకి మహదేవ్ పరిస్థితి చెప్పకూడదు ..... మరెప్పుడు చెప్పాలి? అంతా అయిపోయాకా? అంతా అయిపోయాక అంటే ..... అతను సంపూర్ణ ఆరోగ్యవంతుడయ్యాకా? లేక ..... లే ..... క ..... మరణంతో శాశ్వత నిద్రలోకి పోయాకా? ఛీ ..... ఏమైంది తనకివాళ? ఇలాంటి ఆలోచనలు వస్తున్నాయ్?”

ఆలోచనలను దూరం చేయడానికన్నట్టు నిలబడి అటూ ఇటూ పచార్లు చేయసాగాడతను.

“హిక్ ..... హిక్ ..... హిక్ ..... ” వెక్కిళ్ళతో సతమతమవుతున్నాడు మహదేవ్.

అందరూ అటు చూశారు.

క్షణాలు భారంగా కదలసాగాయ్.

విచిత్రంగా వెక్కిళ్ళాగిపోయి చిన్న మూలుగు విన్పించింది మహదేవ్ గొంతు నుంచి. వెంటనే అభిరాం అతని దగ్గరకు నడిచి తల నిమిరాడు.

మూసుకున్న అతని కళ్ళు లోతుకుపోయాయి. పెరిగిన గడ్డంతో పీక్కుపోయాయి బుగ్గలు.

బిరుసెక్కి అట్టకట్టేసింది జుత్తు! బలమైన అతని దేహం తెల్లగా పాలిపోయి, నీరసించిపోయి వుంది.

రెండు కన్నీటి చుక్కలు అభిరాం కళ్ళనుంచి వీడ్కోలు తీసుకుని హాస్పిటల టైల్స్‌ని అభిషేకించాయి.

అప్పుడే అక్కడికొచ్చాడు డాక్టర్!